క్లుప్తంగా

విద్యుత్ స్తంభాలకు వైర్ల ఏర్పాటు



స్తంభాలకు వైర్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

దెందులూరు: సానిగూడెం గ్రామంలో గురువారం నూతన విద్యుత్ స్తంభాలకు సిబ్బంది వైర్లను ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ కనస్ట్రక్షన్ విభాగం సిబ్బంది పర్యవేక్షణలో నూతన స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేస్తున్నారు. పనులను సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షించారు.

యోగా దినచర్యలో భాగం కావాలి



సచివాలయంలో యోగా క్లాసు నిర్వహిస్తున్న మాస్టర్ ట్రైనర్ పెద్దిరాజు

నిడమర్రు: యోగా చేయడం ప్రతి ఒక్కరూ దినచర్యలో భాగం చేసుకోవాలని యోగా మాస్టర్ ట్రైనర్ పీవీ పెద్దిరాజు అన్నారు. గురువారం పెదనిండ్రకొలను సచివాలయంలో యోగా తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనస్సును లగ్నం చేసి శ్వాస మీద ధ్యాస పెట్టి పట్టు సాధిస్తే శ్వాసకోస వ్యాధులు దరి చేరవన్నారు. అభ్యాసకులతో పలు ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో నిడమర్రు ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ జిజియాభాయి, సర్పంచి, కార్యదర్శి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మోగిన బడి గంట



పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

పెదవేగి: ఏరా ఎలా ఉన్నావ్ ఏఏ ఊరు వెళ్లావ్ సెలవులకు బాగా ఎంజాయ్ చేశారా. ఏవేం చూశావ్, అంటూనే స్నేహితులను పలుకురించుకుంటూ విద్యార్థులు సంతోషంగా బడిలో ప్రవేశించారు. పెదవేగి మండలంలోని అన్ని గ్రామాల్లో పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు గురువారం ఉత్సాహంగా తరలి వచ్చారు. ప్రభుత్వం వేసవి సెలవుల అనంతరం పాఠశాలను తెరిచిన మొదటి రోజునే విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసేందుకు, తాము చదువుతున్న పాఠశాలను చాలా రోజుల తరువాత చూసేందుకు పరుగులు తీశారు. రోజంతా సెలవుల్లో ఎవరెవరు ఏమి చేశారని ఎలా గడిపారనే విషయాలు తెలుసుకోవడంలోనే పూర్తిగా నిమగ్నమై సందడిగా గడిపారు.

ముమ్మరంగా గోదావరి కాలువ ఆధునికీకరణ



కాలువ మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

దెందులూరు: గోదావరి కాలువ మరమ్మతు పనులు వేగవంతంగా సాగుతున్నాయని డీసీ చైర్మన్ వెలమాటి రాంబాబు అన్నారు. గురువారం గోదావరి కాలువ ఇరిగేషన్ ఏఈ సుబ్రహ్మణ్యంతో కలిసి గుండుగొలను, కొమడేపల్లి, ఉండ్రాజువరం, దెందులూరు పాయింట్ల వద్ద పొక్లయినర్లతో నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. లస్కర్లకు ఆధునికీకరణ పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు.

అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

భీమడోలు: కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. కూటమి ఏడాది పాలనకు నిర్వహించిన ర్యాలీలో భీమడోలు గ్రామానికి చెందిన మంచెం నాగుతో పాటు పలువురు హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని వినతి పత్రం అందజేశారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, తహసీల్దార్ బి.రమాదేవి, కరణం పెద్దిరాజు, ప్రత్తి మదన్, ప్రవీణ్ కుమార్ పటేల్, ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎ.భాస్కరకుమార్ పాల్గొన్నారు.

బీటీ రహదారి ప్రారంభం

ఉంగుటూరు: గ్రామంలో రూ.55 లక్షల వ్యయంతో నాచుగుంట బ్రిడ్జి వరకు నిర్మించిన బీటీ రహదారిని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సూరత్తుల అయ్యప్ప, ఎంపీడీవో రాజ్‌మనోజు, పీఆర్‌ఏఈ కృష్ణమోహన్, ఈవోపీఆర్‌డీ చంద్రశేఖర్, సర్పంచి బండారు సింధు, తదితరులు పాల్గొన్నారు.

కలవరపెడుతున్న సీజన్ ఆరంభం

- ఓ పక్క పాఠశాలలు, మరో పక్క ఖరీఫ్ సాగు
- తల్లిదండ్రులను, రైతులను ఆందోళనకు గురి చేసే సమయం
- దిక్కుతోచని స్థితిలో ప్రజలు



ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు (ఫైల్)

పెదవేగి: ఖరీఫ్, పాఠశాల సీజన్లు వచ్చాయంటే రైతుల్లోనూ, విద్యార్థుల తల్లిదండ్రుల్లోనూ ఆందోళన మొదలవుతుంది. రైతులు, పిల్లలను చదివించే సామాన్య, మధ్య తరగతి తల్లిదండ్రులు భయపడిపోతుంటారు. ఇటు చదువులకు, అటు వ్యవసాయ పెట్టుబడులకు ఏటా పెరుగుతున్న ఖర్చులు వీరి ఆందోళనను మరింత పెంచేస్తున్నాయి. వ్యవసాయ పనుల ప్రారంభం, చదువుల కోసం పాఠశాలల ప్రారంభం జూన్‌లోనే ఉంటుంది. ఒక్కో కుటుంబంలో వ్యవసాయం, విద్యార్థులు ఉంటారు. వారి పరిస్థితి మరీ దయనీయం.

భరోసా ఇవ్వని 'కూటమి'

ఇదిలా ఉండగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతుకు అండగా నిలిచేందుకు రైతు భరోసా పేరుతో పెట్టుబడులకు అండగా నిలిచేది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాడు-నేడు పేరిట ప్రభుత్వ పాఠశాలలను ఇంగ్లీషు మీడియంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తల్లిదండ్రులు ఈ విషయం తెలుసుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించే వారు. నేడు కూటమి ప్రభుత్వంలో రైతులకు గాని, విద్యార్థులకు గాని ఎటువంటి భరోసా ఇవ్వకపోవడంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఆందోళనలో ప్రారంభ రోజులు ఏ విధంగా ఎదుర్కోవాలో మనోవేదనకు గురవుతున్నారు.

పెరిగిపోతున్న చదువుల భారం

విద్యార్థుల చదువుల భారం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఏటా ఫీజులు, పుస్తకాల ఖర్చులు భారంగా మారిపోతున్నాయి. రూరల్ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉండరని, పాఠశాలలు ఎత్తేస్తారని, ప్రచారం జరగడంతో తల్లిదండ్రులు మండల కేంద్రాల్లో, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఫీజుల భారం మోయలేక సతమతమవుతున్నారు.

అన్నదాతకు వెన్నుదన్నేదీ?

రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. జూన్‌లో పొలం దుక్కిలతో ప్రారంభమై పెట్టుబడులు, విత్తనాల కొనుగోలు నుంచి వ్యవసాయ పనుల వరకు అన్నీ చేసుకోవాలి. ఎకరం సాగు చేసే రైతు కుటుంబంలో ముగ్గురు కష్టపడితే రూ.20 వేల వరకు పెట్టుబడి అవుతుంది. రైతుల పెట్టుబడుల పరిస్థితి మరింత దయనీయంగా మారనుంది. ఎరువులపై వస్తు సేవల పన్ను (జీఎస్టీ) పెరగడంతో కొంత మేర భారంగా మారింది. దెందులూరు నియోజకవర్గంలో 20 వేల ఎకరాల్లో రైతులు వరి పంటను మరో 490 ఎకరాల్లో కూరగాయలు, ఆకు కూరలతో పాటు పలు రకాల పంటలు పండిస్తున్నారు. ఈ పంటలన్నింటికీ వేలల్లో పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

రెండేళ్లలో పెరిగిన చదువుల ధరలు

రెండేళ్ల క్రితం ఐదో తరగతి లోపు వారికి పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు కలిపి రూ.3 వేలు ఖర్చయ్యేది. ఆరు నుంచి పదో తరగతి వారికి రూ.4 వేలు అయ్యేది. ఇప్పుడు అవి రూ.6 వేలు, రూ.7 వేలు అయ్యాయి. యూనిఫాం జతకు రూ.వెయ్యి ఉండేది. ఇప్పుడు రూ.1500 అవుతోంది. బూట్లు, బ్యాగ్ వగైరాలు రూ.వెయ్యి నుంచి రూ.1,200కు పెరిగింది. దీనికి తోడు విద్యార్థుల ఫీజులు, పాకెట్ మనీ, దోబీ ఖర్చు, హాస్టల్ ఫీజుల గురించి చెప్పక్కర్లేదు.

ఎకరా విస్తీర్ణంలో వరి సాగుకు..

ఒక ఎకరం వరి సాగుకు మొదటి దుక్కికి రూ.1,500, విత్తనాలకు రూ.900, విత్తనాలు వేసే దుక్కికి రూ.1,200, పొలం గట్ల బాగుకు రూ.500, దమ్ము చేసేందుకు రూ.1,200 నారు తీతకు రూ.1,200, ఎరువులకు రూ.2,500, పురుగుల మందులకు రూ.1,500, కోత కోసేందుకు రూ.2,200, చేను కట్టి మోసేందుకు రూ.2,000 ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేలు పెట్టుబడి పెడుతుంటే ఒక్కో విద్యార్థికి రూ.40 వేల నుంచి రూ.50 వేలు వరకు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రూ.30 వేలు పెట్టుబడి పెట్టాలి

ప్రస్తుతం ఎక్కువగా వరి పండిస్తారు. వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. బ్యాంకుల్లో రుణాలు ఇవ్వక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. ఒక్కో కౌలు రైతు ఎకరం నుంచి రెండెకరాలు సాగు చేస్తారు. ఎకరానికి రూ 30 వేలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. వడ్డీ వ్యాపారులు సైతం బ్యాంకుల్లో సరిపడ నగదు లేకపోవడం వల్ల అరువు ఇవ్వడం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

–పంజగల నరశింహరావు, రైతు, కొండలరావుపాలెం

రూ.లక్ష కావాల్సిందే...

ఇద్దరు పిల్లలను బడికి పంపించాలంటే రూ లక్ష కావాల్సిందే. కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు కాకుండా అడ్మిషన్లంటూ రూ వేలు వసూలు చేస్తున్నారు. దీంతో పాటు బస్ చార్జీలు రూ 10 వేలు, పుస్తకాలు, డ్రస్సులు, షూ అంటూ మరో రూ.10 వేలు వసూలు చేస్తున్నారు. ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల్లో రూ 30 వేలు ఖర్చవగా, ఇప్పుడు రెండు, మూడు తరగతులకు ఫీజులే రూ.70 వేలు అవుతోంది.

–యర్రా ముఖర్జి, గ్రామస్తుడు, లక్ష్మీపురం

సర్పంచ్‌కు కుర్చీ ఏర్పాటు



గోపన్నపాలెం సచివాలయంలో సర్పంచ్‌కు ఏర్పాటు చేసిన కుర్చీ

సాక్షి స్పందన

దెందులూరు: ఎట్టకేలకు గోపన్నపాలెం గ్రామ సర్పంచ్ కె.నాగమల్లేశ్వరికి సర్పంచి కార్యాలయంలో కుర్చీ ఏర్పాటు చేశారు. సర్పంచ్‌కు లేని కుర్చీ పేరిట సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికారులు గోపన్నపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గదిలో కుర్చీని ఏర్పాటు చేశారు. టేబుల్ మీద, గది గుమ్మానికి ఉన్న నేమ్ బోర్డులు ఇంకా ఏర్పాటు చేయలేదు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దెందులూరు: మండలంలో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేడ్కర్ తెలిపారు. జోగన్నపాలెం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం జోగన్నపాలెం, అప్పారావుపాలెం, శ్రీరామవరం, కంఠమనేనివారిగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

సమస్యలపై సమష్టిగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంక రవీంద్ర



హాజరైన ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు

మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్సీ వంక రవీంద్ర

ఉంగుటూరు: పార్టీలు వేరే అయినా సమస్యలు పరిష్కార దిశగా ప్రజా ప్రతినిధులు కలిసి పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ వంక రవీంద్ర అన్నారు. గురువారం ఉంగుటూరు మండల పరిషత్ సమావేశం ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్ర మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు ,గ్రామ సభల్లో చేస్తున్న తీర్మానాలు, రికార్డుల మేరకు పనులు జరుగుతున్నాయో లేదో పరిశీలించుకోవాల్సిన బాధ్యత సర్పంచులు, ఎంపీటీసీల మీద ఉందన్నారు. కాకర్లమూడి, నారాయణపురం టూరింగు పేటలో మంచినీళ్ల సమస్య పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామ సమస్యలు రాజకీయాలకు అతీతంగా చూడాలని అపుడే ప్రజల్లో గౌరవం పెరుగుతుందన్నారు. మన హయాంలో ఈ పని గ్రామంలో చేశామనే తృప్తి మనలో మిగలాలని రవీంద్ర అన్నారు. వైఎస్ జగన్ హయాంలో నిర్వహించిన పాఠశాల, సచివాలయ భవనాలు అసంపూర్తిగా ఉన్నా వాటిని పూర్తి చేయాల్సిన అవసరం ఉందని రవీంద్ర అన్నారు. వాటి నిర్మాణాలపై ఒత్తిడి తీసుకొచ్చి పూర్తి అయ్యేలా చేయాలని వివరించారు. ఉంగుటూరు ఎంపీటీసీ పెనుగొండ బాలకృష్ణ మాట్లాడుతూ మే 31న అనుమతులు పొందిన యర్రచెరువు తవ్వకం పనులు తొమ్మిది రోజులు దాటినా ఇంకా విచ్చలవిడిగా తవ్వుతున్నారని, వాటిపై రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు కనపడటం లేదన్నారు. ఎంపీడీవో రాజ్ మనోజు మాట్లాడుతూ యోగాకు ప్రాధాన్యం ఇచ్చిన నేపథ్యంలో 21న జరగబోయే దానికి ట్రైల్ రన్ కింద 14న గ్రామ సచివాలయాల వద్ద నిర్వహించాలన్నారు. పశు వైద్యాధికారి డాక్టర్ శిరీష, డీఆర్‌డీపీ ఏపీఎం ప్రభావతి, విద్యుత్ ఏఈ వేణు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీలక్ష్మి మాట్లాడారు. అనంతరం కాకర్లమూడి ఉప సర్పంచి కూనా రాజు, ఎ.గోకవరం సర్పంచి మిద్దే సత్యవతి, చేబ్రోలు సర్పంచి రందే లక్ష్మీసునీత, ఎంపీటీసీ బండారు నాగరాజు, నాచుగుంట సర్పంచి ఏలేటి సునీత పలు సమస్యలపై ప్రశ్నలను లేవనెత్తారు. జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీడీవో రాజ్ మనోజు, వైస్ ఎంపీపీ శింగిరెడ్డి సూర్యనారాయణ, ఏఈ కృష్ణమోహన్, ఈవోపీఆర్‌డీ చంద్రశేఖర్, ఉప తహసీల్దార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లు



రేడియం స్టాపర్లను ప్రారంభిస్తున్న సీఐ విల్సన్, ఎస్సై వై.సుధాకర్

భీమడోలు: రహదారులపై రాకపోకలు సాగించే వాహనదారులు జాగ్రతగా ఉండాలని భీమడోలు సీఐ యూజే విల్సన్ అన్నారు. జాతీయ రహదారిపై కనకదుర్గమ్మ ఆలయం డివైడర్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న నేపథ్యంలో గురువారం రాత్రి భీమడోలు ఎస్సై వై.సుధాకర్ ఆధ్వర్యంలో రోడ్డుపై రేడియం స్టిక్కర్లు కలిగిన మూడు రోడ్ స్టాపర్లను ఏర్పాటు చేశారు. వాటిని సీఐ యూజే విల్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రహదారిపై వెళ్లే సమయంలో డివైడర్లు, ప్రమాదకర మలుపులు, బ్లాక్ స్పాట్ల వద్ద నెమ్మదిగా వెళ్లాలని ఆయన సూచించారు. అతివేగం ప్రమాదాలకు మూలమని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్లను ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల వలన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, అవగాహన, అప్రమత్తతతో వాహనాలను నడపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

పీఎం, కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి

భీమడోలు: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోని విమాన ప్రమాద ఘటనకు పీఎం నరేంద్రమోదీ, కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడులు నైతిక బాధ్యత వహిస్తూ తమ పదవులకు రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ డిమాండ్ చేశారు. మృతి చెందిన వైద్య విద్యార్థుల కుటుంబాలకు గురువారం రాత్రి ఆయన పత్రికా ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. అహ్మదాబాద్‌లో విమానం లాండ్ అయ్యే సమయంలో వైద్య విద్యార్థులున్న హాస్టల్‌పై కూలిపోవడంతో ప్రయాణికులతో పాటు విద్యార్థులు మృతి చెందారన్నారు. ఈ దుర్ఘటనకు పీఎం, ఆ శాఖ మంత్రి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్నారు. మోదీ పరిపాలనలో రైలు, విమాన ప్రమాదాలు తరచుగా జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రమాదంలో 242 మంది మరణించినా చీమకుట్టినట్లు లేదని ఆయన విమర్శించారు.

మనస్థాపంతో ఆత్మహత్యాయత్నం

ఏలూరు టౌన్: ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతానికి చెందిన ఒక యువకుడు స్నేహితులే తనపై కేసు పెట్టారనే మానసిక వేదనతో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తంగెళ్లమూడి చోడిదిబ్బ ప్రాంతానికి చెందిన ప్రగడ నాగేంద్ర ప్యాకర్స్ అండ్ మూవర్స్‌లో పనిచేస్తున్నాడు. నాగేంద్ర తన స్నేహితులైన రాము, సాయితో పాటు ఈనెల 10న రాత్రి వేళ మద్యం తాగాడు. మద్యం మత్తులో స్నేహితులు ఇద్దరూ నాగేంద్రతో గొడవపడ్డారు. మరుసటి రోజు స్నేహితులిద్దరూ ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై తీవ్ర మనస్థాపానికి గురైన నాగేంద్ర గురువారం ఇంటివద్ద ఉరివేసుకోగా అతడ్ని ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



భీమడోలు: ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న తహసీల్దార్ ఎంఈవోలు



దెందులూరు: మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సుమతి

భీమడోలు: మధ్యాహ్న భోజన పథకాన్ని రుచిగా, శుచిగా తయారు చేసి విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ఎండీఎం నిర్వాహకులదేనని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల పునః ప్రారంభ రోజైన గురువారం నుంచి సన్న బియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నేపథ్యంలో భీమడోలు ఉన్నత పాఠశాల, పోలసానిపల్లి నంబర్-3 ప్రాథమిక పాఠశాలల్లో ఎంఈవో-1, 2 ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కరరావులతో కలిసి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తహసీల్దార్ పరిశీలించారు. ఉన్నత పాఠశాలలో ఆహార పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎండీఎం అందించే విషయంలో నాణ్యత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అయితే తొలి రోజు కావడంతో పాఠశాలలకు విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగా ఉంది. కార్యక్రమంలో హెచ్‌ఎం శేష పద్మజ, వీఆర్వో వినయ్, టీచర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

దెందులూరు: పాఠశాలల్లో సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనాన్ని ఎంఈఓ అన్నమ్మ ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులతో కలిసి రుచి చూశారు. పాఠశాల విద్యార్థుల నుంచి విడివిడిగా ఆహార నాణ్యత రుచికి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎండీఎం సభ్యులకు సూచనలు చేశారు. నాణ్యత ప్రమాణాలు లోపిస్తే చర్యలకు వెనకాడబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా కొవ్వలి ఉన్నత పాఠశాలలో తహశీల్దార్ సుమతి మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో 15 నుంచి 35 శాతం హాజరు నమోదైందని ఆమె అన్నారు.

నేటి ధర్నా వాయిదా

దెందులూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 13వ తేదీన ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద జరగాల్సిన నిరుద్యోగ భృతి, ఫీజు బకాయిలపై నిరసన కార్యక్రమం వాయిదా పడింది. అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం వలన కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామరెడ్డి నాని అన్నారు. గురువారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ మరలా ధర్నా ఎప్పుడు నిర్వహిస్తారనేది తెలియజేస్తామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

నిడమర్రు: పర్యావరణం పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో విజయకుమారి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు ఇంటి ఉదయభాస్కర్, నాయకులు బేతు గణేష్, కమ్మెల గంగాధర్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవాలకు ట్రస్ట్ సేవలు అభినందనీయం



కుక్కలకు సేవలు చేస్తున్న ట్రస్ట్ చైర్‌పర్సన్ శ్రీలత

దెందులూరు: మూగ జీవాలకు చల్లపల్లి చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. జంతు హక్కుల పరిరక్షణలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో చల్లపల్లి చారిటబుల్ ట్రస్ట్ జంతు విభాగం దెందులూరు మండలం సోమవరప్పాడులో చైర్ పర్సన్ చల్లపల్లి శ్రీలత, మిత్ర బృందం విశిష్ట సేవలందిస్తోంది. ఫైట్ ఫర్ యానిమల్స్ నినాదంతో జంతు ప్రేమికులతో కలిసి బృందంగా ఏర్పడి హింసకు గురైన జంతువులను రక్షిస్తున్నారు. కోతులు, కుక్కలు, ఆవులు, పక్షులు జంతువులకు ఆహారం అందించడమే కాక అవి మరణించినప్పుడు ఖననం చేస్తున్నారు. గురువారం సోమవరప్పాడు చల్లపల్లి చారిటబుల్ ట్రస్ట్‌లో చైర్‌పర్సన్ శ్రీలత మాట్లాడుతూ తాను తన మిత్ర బృందం దాదాపు 2 వేల మంది రెండు రాష్ట్రాల్లో 2004లో ఏర్పాటు ట్రస్టు ఏర్పాటు చేశామన్నారు. అప్పటి నుంచి సేవలు అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు పలు రకాల జంతువులు దాదాపు రెండు లక్షలకు పైగా వైద్య సేవలు, అంత్యక్రియలు చేశామన్నారు.


అధికారుల నిర్లక్ష్యంతో ఎండిపోతున్న మొక్కలు



పెదనిండ్రకొలను గ్రామ సచివాలయం బయట ఎండిపోతున్న మొక్కలు

నిడమర్రు: పెదనిండ్రకొలను గ్రామ సచివాలయం వద్ద అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మొక్కలు ఎండిపోతున్నట్లు ఆ గ్రామ ప్రజలు విమర్శిస్తున్నారు. తరువాత ఆ ఎండిన మొక్కలను నాటినా ఎవరికి ఉపయోగమని ప్రశ్నిస్తున్నారు. ఈ నెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించింది. దీని కోసం మండలంలో 14 సచివాలయాలకు 8 వేల మొక్కలను నారాయణపురం అటవీశాఖ నర్సరీ నుంచి నీడనిచ్చే మొక్కలు ఈ నెల 3వ తేదీన అందించారు. అవి ఆయా సచివాలయాల పరిధిలోని అన్ని శాఖలకు అందించాల్సి ఉంది. వీటిని పంపిణీ చేయకుండా సచివాలయం వద్దే మూల పడేశారు. కనీసం వాటికి రోజూ నీటి తడుపు కూడా చేయడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆ మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉపయోగం లేని సిద్దాపురం చెక్ డ్యాం



తుప్పు పట్టిన చెక్ డ్యాం ఇనుప గేట్లు

నిడమర్రు: చినకాపవరం పంట కాలువపై సిద్దాపురం వద్ద నిర్మించిన చెక్ డ్యాం ఐరన్ గేట్లు తప్పు పట్టడంతో ఆ డ్యాం నిరుపయోగంగా మారిందని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలోని నీటి ప్రవాహాన్ని నిరోధించాడానికి, కోతను తగ్గించడానికి నిర్మించిన ఈ చెక్ డ్యాం చానమిల్లి, సిద్దాపురం, కాకరమిల్లి, కృష్ణాపురం, బువ్వనపల్లి రైతులకు వరి, ఆక్వా సాగుకు నీటిని మళ్లించేందుకు ఉపయోగపడుతోంది. గత నాలుగేళ్లుగా ఈ డ్యాం ఇనుప గేట్లు తుప్పు పడుతూ శిథిలావస్థకు చేరుతున్నట్లు స్థానిక రైతులు చెబుతున్నారు. ఈ వేసవిలో గేట్లు మరమ్మతులు చేయాలని అధికారులను కోరినా ప్రయోజనం లేదన్నారు. ఈ విషయంపై నీటి పారుదల శాఖ డీఈ జి.రామును వివరణ కోరగా ప్రతిపాదనలు పంపించామని నిధులు మంజూరైతే పనులు చేపడతామన్నారు.